సాక్షి
ఖమ్మం
సోమవారం । 15 । జూలై । 2024



అంగన్‌వాడీల్లో 'అమ్మ మాట'!

'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' పేరిట అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 8లో



బదిలీలు సరే.. బకాయిలెలా?

గ్రామాల్లో పనుల నిర్వహణకు సొంత డబ్బు పెట్టి బిల్లుల కోసం చూస్తున్న కార్యదర్శులు బదిలీల ప్రక్రియతో ఆందోళన చెందుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
27° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పంచాయతీరాజ్ శాఖలో బదిలీల సందడి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పంచాయతీరాజ్ శాఖలో బదిలీల సందడి నెలకొంది. జిల్లాలోని 589 గ్రామపంచాయతీలకు గాను 571 మంది కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఒకేచోట నాలుగేళ్లు, ఆపైన కాలంగా పనిచేస్తున్న కార్యదర్శుల్లో 40శాతం మందిని బదిలీ చేయనున్నారు. వీరిలో గ్రేడ్-4 సెక్రటరీలు 323 మందికి గాను 129 మందిని బదిలీ చేసే అవకాశముంది. అంతేకాక నలుగురు ఎంపీఓలు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు తొమ్మిది మంది, గ్రేడ్-2 కార్యదర్శులు ఎనిమిది మంది, గ్రేడ్-3లో 19 మందికి తోడు ఇద్దరు బిల్ కలెక్టర్లు కలిపి శాఖలో 171మందికి స్థానచలనం తప్పదని భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం డీపీఆర్‌సీ భవనంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యవేక్షణలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సీనియారిటీ ఆధారంగా బదిలీల కౌన్సెలింగ్ చేపడుతామని డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్, డీపీఓ హరికిషన్ తెలిపారు.

పశు వైద్యశాఖలో

ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశు వైద్య, పశు సంవర్థక శాఖలో ఆఫీస్ సబార్డినేట్ల(అటెండర్లు) బదిలీకి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లాలో 70 మందికి పైగా ఆఫీస్ సబార్డినేట్లుగా పనిచేస్తుండగా.. ఒకే చోట నాలుగేళ్లకు పైగా 52 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 40శాతానికి 28 మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఖమ్మంలోని జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ కార్యాలయంలో జేడీ వేణుమనోహర్ రావు పర్యవేక్షణలో సోమవారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టి, ఈనెల 19నాటికి ఉత్తర్వులు జారీ చేస్తారు.

కేఎంసీలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న వారం పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందున్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటుచేశారు. వర్షం, ముంపు కారణంగా ఇబ్బందులు ఎదురైతే ప్రభావిత ప్రాంతాల ప్రజలు 79012 98265 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఒక ప్రకటనలో సూచించారు.

26 కి.మీ. పీఆర్ రహదారులు ఆర్‌అండ్‌బీకి...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ పరిధి రహదారులను ఆర్‌అండ్‌బీ శాఖలోకి బదలాయించాలని ఆయా శాఖల ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన నేపథ్యాన త్వరలోనే ఉత్తర్వులు విడుదల కానున్నాయని తెలిసింది. ఇటీవల ప్రధానమంత్రి సడక్ యోజన పథకంలో నిర్మించిన రోడ్లను కాంట్రాక్టర్లు ఐదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఇవి మినహా రఘునాథపాలెం మండలం, ఖమ్మంలోని ప్రధాన పీఆర్ రోడ్లను ఆర్‌అండ్‌బీలోకి బదలాయించేందుకు ప్రతిపాదించారు. మంచుకొండ నుండి పంగిడి, మూలగూడెం వరకు 14 కిలోమీటర్ల, బూడిదంపాడు, సూర్యతండా నుండి పుటానీతండా రోడ్డు ఏడు కి.మీ., ఖమ్మంలోని శ్రీనివాస్‌నగర్ నుండి అగ్రహారం వరకు ఐదు కి.మీ. మేర రోడ్లను ఈ జాబితాలో చేర్చారు. కాగా, పీఆర్ శాఖ పరిధిలో ఉన్న లింక్ రోడ్లు ఐదు కి. మీ., దాటాక ఆర్‌అండ్‌బీలోకి బదలాయిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఇదే అంశంపై ఇటీవల రఘునాథపాలెంలో జరిగిన సమీక్షించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యకల్యాణంలో 85 జంటలు పాల్గొన్నాయి.

ఉత్తిపోతలే..

జిల్లాలో అలంకారప్రాయంగా పథకాలు

- మొత్తం 135 ఎత్తిపోతల పథకాలు ఉన్నా ఫలితం సున్నా
- పూర్తిస్థాయిలో పనిచేస్తున్నవి 36 మాత్రమే
- ప్రశ్నార్థకంగా ఆయకట్టు సాగు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో ఎత్తిపోతల పథకాలు మూలన పడ్డాయి. సరైన నిర్వహణ లేక ఏటేటా వీటి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రైతులు సైతం మరమ్మతులు చేయించుకోలేక వదిలేస్తున్నారు. దీంతో ముందుచూపుతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారి వర్షాభావ పరిస్థితుల్లో ఆదుకోవాల్సినా అలంకార ప్రాయంగా మిగిలిపోతున్నాయి. ఫలితంగా వీటి పరిధిలో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ఎత్తిపోతల పరిస్థితీ ఇలాగే ఉండడం గమనార్హం.

దాదాపు అన్నీ అంతే...

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 135 ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి పరిధిలో 46,909 ఎకరాల భూమి సాగవుతోంది. కానీ నిర్మించిన తర్వాత నిర్వహణ.. మోటార్లు పాడైనప్పుడు మరమ్మతు చేయించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదు. కొన్నిసార్లు రైతులు చందాలు వేసుకుని బాగు చేయించుకుంటున్నా ఆపై పదేపదే పాడైతే వారు కూడా ఏం చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. ఫలితంగా అవి అలాగే మిగిలిపోతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 36 ఎత్తిపోతల పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో 24,054 ఎకరాలు సాగవుతోంది. మరో 23 పథకాలు పాక్షికంగా పనిచేస్తుండగా, వీటి కింద 10,671 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే పాక్షికంగా పనిచేసే పథకాలు ఎప్పుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో రైతులు పంటలు సాగు చేయాలా, వద్దా అన్న మీమాంస ఎదుర్కొంటున్నారు. ఇక 57 ఎత్తిపోతల పథకాలు పూర్తిస్థాయిలో పనిచేయకపోగా, వీటి పరిధిలో 9,601 ఎకరాల భూమి ఉన్న రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

పనికిరానివి.. 19

ఎత్తిపోతల పథకాల్లో 19 పూర్తిగా పనికిరాకుండా పోయాయి. ఇవి మరమ్మతుకు కూడా వీలు లేకపోవడంతో వదిలేశారు. ఇందులో 17పథకాలు మధిర నియోజకవర్గంలోనే ఉండడం గమనార్హం. మరో రెండు వైరా మండలంలో ఉన్నాయి.

నిధులు అరకొరగానే...

జిల్లాలోని 18 ఎత్తిపోతల పథకాల మరమ్మతు, నిర్వహణ కోసం రూ.1,84,90,000 అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మధిర నియోజకవర్గంలో 16, వైరా నియోజకవర్గంలో రెండు పథకాల కోసం ప్రతిపాదనలు సమర్పిస్తే మధిర నియోజకవర్గంలో 11 పథకాలకు రూ.66.26 లక్షలు, వైరా నియోజకవర్గంలో రెండింటికి రూ.7.60 లక్షలు మంజూరయ్యాయి. ఇక సత్తుపల్లి నియోజకవర్గంలో 18 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.3,76,02,000 అవసరమని నివేదిస్తే ఇప్పటి వరకు రూపాయి రాలేదు. అలాగే, రఘునాథపాలెం మండలం పాపటపల్లి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.7లక్షలు వెచ్చిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశమున్నా నిధులు విడుదల చేయలేదు. ఇక వీ.వీ.పాలెం లిఫ్ట్ ఇరిగేషన్ కింద 1,240 ఎకరాల ఆయకట్టు ఉన్నా ఒక మోటారు పనిచేయక.. స్టార్టర్లు, పైపులు దెబ్బతినడంతో ఆయకట్టు సగమే సాగవుతోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక లిఫ్ట్‌లు మోటార్లు, పైపులైన్, స్టార్టర్ల సమస్యతో మూలనపడ్డాయి. కొద్దిమేర నిధులు కేటాయిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశమున్నా అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మునిగి మూడేళ్లు..

ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఖమ్మం రూరల్ మండలం తీర్థాల మున్నేరు సమీపంలోని ఎత్తిపోతల పథకం. ఇక్కడ 600ఎకరాల ఆయకట్టు ఉంది. మూడేళ్ల క్రితం వచ్చిన వరదకు గది కూలిపోయినా వినియోగంలోకి తీసుకురావడానికి నిధులు కేటాయించలేదు. ఇక ఆశలు వదిలేసుకున్న కొందరు రైతులు బావులు తవ్వగా.. ఇంకొందరు మున్నేరులో మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ పథకాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి రూ.3కోట్లు అవసరమని ప్రతిపాదిస్తే పైసా మంజూరు కాలేదు.



చింతకాని మండలంలో...

చింతకాని: చింతకాని మండలంలోని మత్కేపల్లి, తిమ్మినేనిపాలెం, సీతంపేట, జగన్నాధపురం, చింతకాని, లచ్చగూడెం, బొప్పారంల్లో నిర్మించిన ఎత్తిపోతల పథకాల్లో కేవలం జగన్నాధపురం ఎత్తిపోతల పథకం మాత్రమే పనిచేస్తోంది. మిగతావాన్నీ రకరకాల కారణాలతో మూలనపడ్డాయి. వీటి మరమ్మతుల కోసం రైతులు నీటిపారుదల కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చింతకాని మండలం మత్కేపల్లిలో కాలిపోయిన పథకం మోటార్లు

పంటలు ఎండిపోతున్నాయి



ఎత్తిపోతల పథకం కింద పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నీటి సౌకర్యం లేక ఏటా ఎండిపోతున్నాయి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేస్తే నీటి సౌకర్యం లేక దిగుబడి దక్కడం లేదు. ఏళ్లుగా ఎత్తిపోతల పథకాలు మరమ్మతుకు నోచుకోవడం లేదు.

– నర్సింశెట్టి లక్ష్మీనారాయణ, రైతు, మత్కేపల్లి

మరమ్మతులు చేపట్టాలి



అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలి. తద్వారా ఆయకట్టుకు నీరు అందుతుంది. లేకపోతే సాగునీటి విషయంలో ఇబ్బంది పడాల్సి వస్తోంది. పంటలు ఎండిపోతున్నాయని తెలిసినా పట్టించుకోకపోవడం సరికాదు.

– చిర్ర నారాయణ, రైతు, మత్కేపల్లి

ప్రతిపాదనలు సమర్పించాం...

జిల్లా వ్యాప్తంగా 135 లిఫ్ట్‌లు ఉన్నాయి. వాటిలో 36 పూర్తి స్థాయిలో పని చేస్తుండగా మిగిలినవి కొన్ని పాక్షికంగా, మరికొన్ని చిన్నచిన్న మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. వీటి విషయమై ఇప్పటికే దృష్టి సారించాం. మిగతావి కూడా పనిచేసేలా నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాం. రైతుల భాగస్వామ్యం ఉంటేనే అనుకున్న లక్ష్యం మేర ఆయకట్టుకు నీరు అందుతుంది.

– విద్యాసాగర్, జలవనరుల శాఖ సీఈ

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో పర్యటన

ఖమ్మంరూరల్/కూసుమంచి: అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం, ఆరెంపుల, తనగంపాడు, పొన్నేకల్లులో సీసీ రోడ్ల నిర్మాణం, రోడ్డు మరమ్మతుల పనులకు ఆదివారం శంకుస్థాపన చేసిన మంత్రి, గూడూరుపాడులో పల్లె దవాఖానాను ప్రారంభించారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి పల్లెసీమలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కాగా, పాలేరు నియోజకవర్గంలోని 132 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అలాగే, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో ధరణి దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ భవనాలకు భూసేకరణ, పాలేరు నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మాణంపై సమీక్షించారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, ఆర్డీఓ గణేష్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, నాయకులు మద్ది మల్లారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, పుచ్చకాయల కమలాకర్, సుధాకర్, దండి సురేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు 'విజయ' పాలు

- అనుమతి జారీ చేసిన ఉన్నతాధికారులు
- ఉమ్మడి జిల్లాలో 300 హాస్టళ్లకు నిత్యం 6వేల లీటర్ల సరఫరా
- రెండు, మూడు రోజుల్లో మొదలుకానున్న ప్రక్రియ
- నెలకు రూ.1.44 కోట్ల మేర వ్యాపారం



ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల ప్రభుత్వ వసతి గృహాలకు 'విజయ' పాల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ కారణాలతో కొన్నాళ్ల నుంచి హాస్టళ్లకు ఓ ప్రైవేట్ సంస్థ పాలు సరఫరా చేస్తోంది. ఇటీవల ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ముందుకొచ్చింది. ఈ విషయమై తాజాగా బదిలీ అయిన ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీ దృష్టికి తీసుకెళ్లడంతో అనుమతించారు. ఉమ్మడి జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా కూడా విజయ పాలు, పాల ఉత్పత్తులతో పాటు విజయ ప్యాకేజ్డ్ తాగునీరు కూడా హాస్టళ్లు, అవసరమైన సంస్థలకు పంపిణీ చేసేలా ఉన్నతాధికారులు, కలెక్టర్లు అనుమతించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల అధికారులను డీడీ కలిసి అనుమతులు తీసుకోవడంతో హాస్టళ్లు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, నవోదయ స్కూళ్లకు విజయ పాల పంపిణీకి మార్గం సుగమమైంది.

రూట్లు ఖరారు..

ప్రభుత్వ అనుమతుల ఆధారంగా ఉమ్మడి జిల్లాలోని ఉన్న 300 హాస్టళ్లకు నిత్యం ఆరు వేల లీటర్ల పాలను సరఫరా చేసేందుకు పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం జిల్లాలో 88 హాస్టళ్లకు ఐదు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని 212 హాస్టళ్లకు ఎనిమిది నుంచి 10 రూట్ల ద్వారా పాల పంపిణీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పాల పంపిణీదారుల ఎంపిక ప్రక్రియ కూడా ఓ కొలిక్కి వచ్చింది. ప్రభుత్వ హాస్టళ్లకు మంగళవారం లేదా బుధవారం నుంచి విజయ తెలంగాణ పాలను పంపిణీ చేసేందుకు పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ సిద్ధమైంది. రెండు జిల్లాల్లో కలిపి ప్రస్తుతం ఆరు వేల వేల లీటర్ల పాలు సేకరిస్తుండగా ప్రభుత్వ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ మొత్తం పంపిణీకి సరిపోతాయని తేల్చారు.

రెండు రోజుల నగదు డిపాజిట్

ఉమ్మడి జిల్లాలోని హాస్టళ్లకు పాల పంపిణీ ద్వారా పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నెలకు రూ.1.44 కోట్ల వ్యాపారం చేసే అవకాశముంది. లీటర్ పాలకు రూ.58 చొప్పున నిత్యం 6వేల లీటర్ల పాల విలువ రూ.3.48 లక్షలుగా లెక్కించారు. తొలుత పంపిణీదారుల నుంచి రెండు రోజులకు సరిపడా నగదును డిపాజిట్‌గా సేకరిస్తారు. ఆపై ఏ రోజుకారోజు నగదు చెల్లించి సంస్థ నుంచి పాలు తీసుకుని సంస్థలు, హాస్టళ్లకు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెంరూరల్: ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కొత్తగూడెంలో పర్యటించారు. మొదట భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని అధికారులకు సూచించారు. రైల్వేస్టేషన్ నుంచి రద్దయిన రైళ్లను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం విద్యానగర్‌లోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో తనకు 75 వేల ఓట్ల మెజార్టీ అందించిన ప్రజలకు పాదాభివందనాలు తెలుపుతున్నానని చెప్పారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర మంత్రులతో మాట్లాడుతానని చెప్పారు. రైల్వే అధికారులతో మాట్లాడి గొల్లగూడెం రోడ్డు వెడల్పునకు స్థల సేకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, రైల్వే స్టేషన్ మాస్టర్ విశ్వనాథ్, అధికారులు రామ్‌భజన్ వీణ, పాషా, రాజారెడ్డి, ఎండీ ఇర్ఫాన్, ఎండీ జావీద్, జేమ్స్‌పాల్, ఖాజా బాబా, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, మహిళా కాంగ్రెస్ జిల్లా



రైల్వే అధికారితో చర్చిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన నాయకులు

అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, నాయకులు ఆళ్ల మురళి, నాగేంద్రత్రివేది, గోపాల్‌రావు, కోనేరు సత్యనారాయణ, జేవీఎస్.చౌదరి, మేరెడ్డి జనార్దన్ రెడ్డి, చీకటి కార్తీక్, పాల సత్యనారాయణరెడ్డి, బాల ప్రసాద్, సుందర్‌లాల్ కోరి, రజాక్ ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఈఓ ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో అధి కారులు, కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, జెడ్పీటీసీ బి.వాసుదేవరావు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, నాయకులు జాలే జానకిరెడ్డి, కొండం వెంకన్న, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయంభయం

- పెచ్చులూడిపడుతున్న ఇళ్ల శ్లాబ్‌లు
- కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీ వాసులగోడు
- సింగరేణి పేలుళ్లతో నిద్ర కరువవుతోందని ఆందోళన

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్‌కాస్టు గనుల్లో బాంబు పేలుళ్ల కారణంగా దెబ్బతిన్న ఇళ్లల్లో ఉండాలంటే క్షణమొక యుగంగా గడపాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు తవ్వకాలతో కిష్టారంపై అత్యధిక ప్రభావం ఉంటోంది. నలువైపులా బొగ్గు తవ్వకాలతో నిత్య నరకంలా మారగా గ్రామంలో ఉండాలంటే ఎప్పుడు ఎక్కడ ఇల్లు కూలిపోతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని స్థానికులు చెబుతున్నారు. కాగా, మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో సత్తుపల్లి మండలం కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీల్లో ఆదివారం నాలుగైదు ఇళ్ల శ్లాబ్‌లు పెచ్చులూడి పడ్డాయి. పత్తిపాటి నాగేంద్ర ఇంట్లో శ్లాబ్ పెచ్చులు ఊడి మంచంపై పడగా అంతకు కొద్దిసేపటి క్రితమే నాగేంద్ర నిద్ర లేవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. 2006లో ఇందిరమ్మ పథకం కింద కాలనీలో మంజూరు చేసిన ఇళ్లన్నీ ఇప్పుడు నెర్రెలు వారి, పగుళ్లు వచ్చి కూలిపోయే దశకు చేరుకున్నాయి.

175 ఇళ్లు సర్వే చేసి...

కిష్టారం ఓపెన్‌కాస్ట్‌కు కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న ఎస్సీ, బీసీ కాలనీ ఇళ్లు దెబ్బతింటున్నాయని రెండేళ్ల క్రితమే సింగరేణి సంస్థ గుర్తించింది. బ్లాస్టింగ్ తీవ్రతకు సగానికిపైగా ఇళ్లు గోడలు, శ్లాబ్‌లు నెర్రెలు వారి శిథిలావస్థకు చేరాయి. కాలనీ వాసులు పలుమార్లు ఆందోళన చేయటంతో సింగరేణి సంస్థ 175 ఇళ్లలో మరమ్మతులు చేయించేందుకు ముందుకొచ్చింది. కానీ మరమ్మతు చేసినా పనికిరాని విధంగా తయారడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక వర్షానికి కురుస్తున్న ఇళ్లకు పట్టాలిస్తామంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడుతున్నారు.



పత్తిపాటి నాగేంద్ర ఇంట్లో పెచ్చులూడిన శ్లాబ్

మా ఇళ్లల్లో ఉండలేం..

గనుల్లో బాంబ్ బ్లాస్టింగ్ మొదలైందంటే ఇళ్లన్నీ కంపిస్తాయని, అందరం బయటకు వచ్చి నిల్చోవాల్సిందేనని కాలనీ వాసులు వాపోతున్నారు. కొత్త ఇళ్లు మంజూరు చేసినా బాంబుల తీవ్రతకు మళ్లీ దెబ్బతింటాయని.. అందుకే పునరావాసం కింద మరోచోట కాలనీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, అధికారులు మాత్రం వ్యవసాయ భూములు వద్దంటున్నా తీసుకుంటూ, ఇళ్ల సేకరణపై అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకుడు దయానంద్

సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా..

కిష్టారం ఎస్సీ, బీసీ, అంబేడ్కర్ కాలనీలో సమస్యలపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అసెంబ్లీలో ప్రస్తావించారని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ తెలిపారు. కిష్టారం పీఓ నర్సింహారావుతో కలిసి ఆదివారం దెబ్బతిన్న ఇళ్లను ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఇక్కడి సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడమే కాక 19న కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. నాయకులు ఉడతనేని అప్పారావు, నరుకుళ్ల అప్పారావు, పానెం ఈశ్వర్, ధనుంజయ్ పాల్గొన్నారు.

ప్రాణాపాయం తప్పింది..



ఉదయం నిద్రలేచి బయటకు వచ్చే సరికి పెద్దశబ్దంతో శ్లాబ్ పెచ్చులూడి మంచంపై పడింది. కొద్ది సమయం ముందే నేను బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. వర్షాకాలంలో శ్లాబ్‌లు తడిసి నానిపోయి కూలే దశకు చేరాయి.

– పత్తిపాటి నాగేంద్ర, కిష్టారం

ఎప్పుడు కూలిపోతుందో..



ఎప్పుడు ఏ ఇళ్లు కూలిపోతుందో అర్థం కావడం లేదు. అందుకే భయం భయంగా గడుపుతున్నాం. నాలుగైదేళ్ల నుంచి ఇళ్లు దెబ్బతిన్నాయని చెబుతున్నా పట్టించుకోవటం లేదు. బాంబు పేలుళ్లతో ఇల్లు ఊగి పడుతుందేమోనని అనిపిస్తుంది.

– రాయల రమణ, కిష్టారం

ఉపాధ్యాయులకు క్షీరాభిషేకం !

ముదిగొండ: ఇటీవల విద్యాశాఖలో పదోన్నతుల సందర్భంగా ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్తుండడంతో విద్యార్థులు కన్నీళ్లతో వీడ్కోలు పలుకుతున్న ఘటనలను చూస్తున్నాం. అయితే, ముదిగొండ మండల కేంద్రంలోని మిట్టగూడెం ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను విద్యార్థులు వినూత్నంగా సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయులు ఉషాకుమారి, సునీత, సురేష్ బదిలీపై వెళ్తుండగా ఈనెల 10న పాఠశాలలో విద్యార్థులు క్షీరాభిషేకం చేయగా తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వీడియోలు ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ అయ్యాయి.



ఉపాధ్యాయులకు క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీలో తృతీయ స్థానం



పతకాలు అందుకుంటున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్/ముదిగొండ : మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ బాలికల పోటీల్లో ఖమ్మం జిల్లాకు మూడోస్థానం లభించింది. మూడోస్థానం కోసం మహబూబ్‌నగర్ జట్టుతో ఖమ్మం జట్టు తలపడగా చెరో గోల్ లభించింది. ఆతర్వాత అదనపు సమయం ఇవ్వడంతో జిల్లా జట్టు గెలుపొందింది. ఈమేరకు క్రీడాకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే.ఈ.సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్‌తో పాటు కృష్ణయ్య, శ్రీదేవి, నోయల్‌జాక్సన్, మాధురి తదితరులు అభినందించారు. కాగా, ఈ జట్టులో మేడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బయ్యం కీర్తి, తనుశ్రీ సత్తా చాటారని హెచ్‌ఎం నాగేశ్వరరావు తెలిపారు. వీరిని హెచ్‌ఎంతో పాటు ఎంపీపీ హరిప్రసాద్, పీడీలు బియ్యాని కృష్ణయ్య, శ్రీనివాస్, గ్రామస్తులు అభినందించారు.

రూ.13లక్షలతో గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ



లైబ్రరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: ప్రజలకు ఉపయోగపడే పనులు చేసేందుకు అందరూ ముందుకు రావాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచందర్ కోరారు. ఏన్కూరు గురుకుల విద్యాలయంలో అభయ ఫౌండేషన్, పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యాన రూ.13 లక్షలతో గ్రంథాలయ భవనానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ నుంచి రూ.8లక్షలతో పాటు పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.5లక్షలతో లైబ్రరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తడి శ్రీనివాసర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు బండి గిరిబాబు, జోగారావు, కృష్ణయ్య, భిక్షం, వెంకన్న, వేల్పుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆగ్రహం

శిశువు మృతిపై తల్లాడ పీహెచ్‌సీలో విచారణ

తల్లాడ: తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి ఘటనపై సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం ఆదివారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి డాక్టర్ గోపి, స్టాఫ్‌నర్సు కళావతి, ఏఎన్‌ఎం త్రివేణి తీరును తప్పుపట్టిన ఆయన ప్రసవం కోసం వచ్చిన లావణ్యను గంట ముందు ఖమ్మం పంపినా పసికందు బ్రతికేదనని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పీహెచ్‌సీలో చేరిన లావణ్యకు రాత్రి 7 గంటల నుంచి పురిటి నొప్పులు ప్రారంభం కాగా. 9 గంటల తర్వాత కడుపులో నుంచి శిశువు బయటకు వచ్చి తల అడ్డం తిరిగింది. దీంతో అప్పటికప్పుడు సిబ్బంది ఖమ్మం వెళ్లాలని చెప్పారు. అయితే, అంతసేపు తల్లాడలో ఉంచకుండా ముందుగానే 108లో ఖమ్మం పంపిస్తే ఫలితం ఉండేదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అభిప్రాయపడ్డారు. కాగా, స్టాఫ్ నర్సు కుమారుడు, ఏఎన్‌ఎం కుమార్తె పీహెచ్‌సీలో ఎందుకు ఉన్నారని ఆరా తీసిన ఆయన డాక్టర్ గోపి అలసత్వంపైనా ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఘటనపై డీఎంహెచ్‌ఓకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. కాగా, విచారణ సందర్భంగా స్టాఫ్‌నర్సు కళావతి తన తప్పేమి లేదని కంటతడి పెట్టింది. మండల వైద్యాధికారి రత్నమనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నుండి ఐదుగురి బహిష్కరణ

ఖమ్మంవన్‌టౌన్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) నుండి ఆటో యూనియన్ కార్మికులైన సీహెచ్.విప్లవ్‌కుమార్, బొడ్డు సైదులు, జంగిపల్లి ప్రసాద్, ప్రభాకర్, గయాజ్ పాషాను బహిష్కరించినట్లు జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో శనివారం జరిగిన ఐఎన్‌టీయూసీ జిల్లా సర్వసభ్య సమావేశంలో వీరి తొలగింపునకు తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. కాగా, నామినేటెడ్ పదవుల్లో ఐఎన్‌టీయూసీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నగరంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించాలని తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు.

జల్లేపల్లిలో మరో నాలుగు డెంగీ కేసులు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లిలో డెంగీ కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. గ్రామంలో 100 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తుండగా పారిశుద్ధ్య లోపమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారిలో ఇప్పటివరకు 9మందికి డెంగీ సోకినట్లు నిర్ధారణ కాగా, ఆదివారం మరో నాలుగు కేసులు నమోదయ్యాయి. గ్రామంలో రోజురోజుకు డెంగీ కేసులు పెరుగుతుండడంతో ఇకనైనా అధికారులు పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో 'అమ్మ మాట'



నేలకొండపల్లిలో బోధనను పరిశీలిస్తున్న ఏసీడీపీఓ కనకదుర్గ (ఫైల్)

- చిన్నారులను చేర్పించేందుకు సరికొత్త కార్యక్రమం
- నేటి నుంచి 20వరకు నిర్వహించేలా కార్యాచరణ
- ఇప్పటికే మొదలైన పూర్వ ప్రాథమిక విద్య

నేలకొండపల్లి: పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మ మాట... అంగన్‌వాడీ బాట' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ అంశంపై అంగన్‌వాడీ టీచర్లకు విడతల వారీగా ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఇక సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు పిల్లలకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్య బోధంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించి సామగ్రిని సైతం సమకూర్చగా.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జిల్లాలోని 1,840 కేంద్రాల్లో...

జిల్లాలో మొత్తం 1,840 అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నుంచి అమ్మ మాట... అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తారు. కేంద్రాల్లో 43,501 మంది చిన్నారులకు గుడ్లు, 9,079మంది గర్భిణులు, 8,359మంది బాలింతలకు పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు అందిస్తున్నారు. చిన్నారులు ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో ఉంటుండగా.. మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల పూర్వ ప్రాథమిక విద్య సైతం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు మాస్టర్ ట్రెయినర్ల ద్వారా శిక్షణ ఇప్పిఇంచారు. వీరు పిల్లలకు ఆటపాటలు, కథలతో పాటు సంభాషణ నైపుణ్యాలు నేర్పించనున్నారు.

కార్యక్రమాలు ఇలా....

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తుండడంతో పిల్లల సంఖ్య మరింత పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మరోమారు బడిబాట నిర్వహణకు సిద్ధమయ్యారు. గతంలో జరిగిన బడిబాటలో మిగిలిన చిన్నారులను సైతం గుర్తించి కేంద్రాల్లో చేర్పించేలా సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతారు. ఇందులో భాగంగా 15, 16వ తేదీల్లో ర్యాలీలు నిర్వహిస్తారు. అలాగే, 18న ఇంటింటికీ వెళ్లి రెండున్నర ఏళ్లు దాటిన వారిని గుర్తించి పూర్వ ప్రాథమిక విద్య, బోధనా పద్ధతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ఆపై 19 న స్వచ్ఛ అంగన్‌వాడీ నిర్వహించడంతో పాటు 20న సామూహిక అక్షరాభ్యాసాలు, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తారు.

విజయవంతం చేయాలి...



అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చేపట్టే 'అమ్మ మాట... అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని అందరూ విజయంతం చేయాలి. గతంలో చేపట్టిన బడిబాటలో మిగిలిన వారిని కూడా కేంద్రాల్లో చేర్చడంపై దృష్టి సారించాం. ఇందుకోసం రోజు వారీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ఈ విషయమై పిల్లల తల్లిదండ్రులు కూడా మాతో కలిసిరావాలి

– రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి

అ'పూర్వ' సమ్మేళనం



పెనుబల్లి : ఒకే వేదికపై చిన్ననాటి స్నేహితులు

ఏళ్ల తర్వాత కలుసుకున్న అలనాటి విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్/వైరా/పెనుబల్లి: ఖమ్మంలోని ప్రభుత్వ యూపీఎస్ కూచవల్లా పాఠశాలలో 1973–74 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదివిన విద్యార్థులు 50 ఏళ్ల అనంతరం మళ్లీ ఒకే వేదికపై కలుసుకున్నారు. ఖమ్మంలోని కొత్తూరులో మందడపు రామకృష్ణారెడ్డి నివాసంలో కలిసిన వారు వయస్సు 60 ఏళ్ల పైబడినా యువతీయువకుల్లా రోజంతా ఉల్లాసంగా గడిపి నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థి కే.వీ.చారి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమ్మేళనంలో జి.నాగమణి, పారుపల్లి సత్యనారాయణ, ఉదారి శ్రీనివాస్, టి.పద్మజ, కె.పద్మ, సుహాసిని, జె.పాపారావు, ఏ.రాధాకృష్ణ, అక్బర్ పాషా, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇక వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో 1980–81 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తిచేసిన వారు సమావేశమయ్యారు. పూర్వవిద్యార్థి వజినేపల్లి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమకు పాఠాలు బోధించిన గురువులు ఎం.పుల్లారావు, కృష్ణయ్య సూరి, సీహెచ్.కృష్ణారావు, సీహెచ్.మందయ్యను ఘనంగా సత్కరించారు. అయ్యప్ప ఆలయ చైర్మన్ కొప్పురావూరి వెంకటకృష్ణ, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావుతో పాటు రాయల నాగేశ్వరరావు, లగడపాటి నెహ్రూ, వూరుకొండ శ్రీనివాసరావు, అనుమోలు శ్రీనివాసరావు, కొత్తా శ్రీనివాసరావు, దార్న వెంకటకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పెనుబల్లి మండలం రంగారావు బంజర్‌లో పదో తరగతి పూర్తిచేసిన 40 ఏళ్లకు స్నేహితులు కలుసుకున్నారు. రంగారావుబంజర్‌లోని సోమరాజు సీతారామరాజు సమావేశమై అలనాటి జ్ఞాపికలను గుర్తుచేసుకుని సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట శ్రీనివాసరావు, మిట్టపల్లి జనార్దన్, కోటినేని శ్రీనివాసరావు, జోనబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఖమ్మం మయూరి సెంటర్ : 50 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు



వైరా : అలనాటి గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

ఇప్పుడైనా రెగ్యులర్ అధికారిని నియమించేనా?

- 14 ఏళ్లుగా దేవాదాయ శాఖలో ఇన్‌చార్జి పాలనే
- బదిలీల్లో అసిస్టెంట్ కమిషనర్ నియామకానికి అవకాశం

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పోస్టు 14 ఏళ్లగా భర్తీకి నోచుకోవడం లేదు. శాఖలో పనిచేసే సూపరింటెండెంట్లు, పొరుగు జిల్లాల అధికారులకే ఇన్‌చార్జ్ బాధ్యతలు కట్టబెట్టి నెట్టుకొస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కూడా అసిస్టెంట్ కమిషనర్ పోస్టు భర్తీలో దేవాదాయ శాఖ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పరిధిలో ఉన్న ఆలయాలే కాక దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం సైతం అసిస్టెంట్ కమిషనర్ పరిధిలోనే ఉంటుంది. ఈ ఆలయంలో నిర్వహించే శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలకు దేశంలోనే ప్రాధాన్యత ఉంది. ఇక ఖమ్మం జిల్లాలోని జమలాపురం ఆలయం సహా ఇతర ఆలయాలకు వందలాది దేవాలయాలకు వేలాది ఎకరాల భూములు, ఆస్తులు ఉండగా.. రూ.కోట్లలో ఆదాయం నమోదవుతోంది. అయినప్పటికీ దేవాదాయ, ధర్మాదాయ శాఖకు రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్ లేకపోవడంతో తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రెండు జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ఆలయ భూముల ఆక్రమణలు వెలుగు చూస్తుండడానికి పర్యవేక్షణ లోపమే కారణమని చెబుతున్నారు.

ఈసారి బదిలీల్లోనైనా....

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల బదిలీలకు కసరత్తు జరుగుతోంది. అసిస్టెంట్ కమిషనర్ హోదాలోని అధికారుల బదిలీలు మల్టీ జోన్ పరిధిలో చేపట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యాన ఖమ్మం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా కొనసాగుతున్న సులోచన కూడా ఆప్షన్ ఇచ్చారు. దీంతో ఆమె సైతం బదిలీ కానుండగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్ వస్తారనే భావన వ్యక్తమవుతోంది. ఈనెల 20వ తేదీ నాటికి కమిషనర్ నియామకంపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

2010 వరకే రెగ్యులర్ అధికారి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2010 వరకు ఇక్కడ రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్లను నియమించారు. 2010 వరకు ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా /జ్ఞానదేవ్‌రెడ్డి పనిచేశారు. ఆతర్వాత సూపరింటెండెంట్లు, గ్రేడ్–1 ఈఓలు, పొరుగు జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు విజయ రామారావు, రాజేంద్రం, గౌరీశంకర్, మహేంద్రకుమార్ గతంలో ఇన్‌చార్జిలుగా కొనసాగగా, ప్రస్తుతం నల్లగొండ జిల్లా చెరువు గట్టు ఆలయ ఈఓ ఏ.సులోచన మూడేళ్లు నుంచి ఏసీగా విధులు నిర్వహిస్తున్నారు.

కుమార్తెతో పాటు ఆత్మహత్యాయత్నం

- అంతకుముందే డయల్ 100కు ఫోన్
- కానిస్టేబుల్ స్పందనతో నిలిచిన రెండు ప్రాణాలు



నరేష్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ బ్రహ్మం

కూసుమంచి: కుటుంబ కలహాల నేపథ్యాన రెండేళ్ల కుమార్తెతో పాటు ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా.. బ్లూకోట్ కానిస్టేబుల్ సరైన సమయానికి చేరుకుని రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన జంపాల నరేష్, ఆయన భార్య నడుమ కుటుంబ కలహాల కారణంగా ఆమె మోతె మండలం తుమ్మలపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో నరేష్ శనివారం తన భార్య వద్దకు వెళ్లి రెండేళ్ల కూతురిని తీసుకుని జీళ్లచెరువు వచ్చాడు. రాత్రి 10 గంటల సమయాన ఆటోలో కుమార్తెతో కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డయల్ 100కు ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన బ్లూకోట్ కానిస్టేబుల్ బ్రహ్మం రిజర్వాయర్ వద్దకు చేరుకుని వెతకడం మొదలుపెట్టాడు. అప్పటికే నరేష్ తన చొక్కాకు రాయి కట్టి కాళ్లకు బిగించుకుని పాపతో పాటు నీటిలో దూకేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయానికి వచ్చిన కానిస్టేబుల్ బ్రహ్మం ఆయనను అడ్డుకున్నాడు. ఆపై నరేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చాక కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఇద్దరు ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ బ్రహ్మంను పలువురు అభినందించారు.

పట్టపగలే ఆలయంలో చోరీకి యత్నం

- ముగ్గురు పరారీ.. ఒకరిని బంధించిన స్థానికులు
- నిందితులు మహిళలు, మైనర్లు



నిందితులు తీసుకెళ్లేందుకు యత్నించిన సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్సై

నేలకొండపల్లి: పూజ చేసేందుకు వచ్చినట్లు అందరినీ నమ్మించిన కొందరు పట్టపగలే ఆలయ తలుపులు పగలగొట్టి వెండి వస్తువులను చోరీకి యత్నించారు. అయితే, స్థానికులు అప్రమత్తం కావడంతో ముగ్గురు పరారవగా ఒకరు పట్టుబడడంతో పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం మధ్యాహ్నం నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలురు ఉండగా.. పూజల కోసం వచ్చినట్లు ప్రవర్తించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేసి, గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశాక అక్కడి భక్తులంతా వెళ్లిపోయిన అనంతరం వెనక తలుపులు పగలగొట్టి లోనకు చొరబడ్డారు. నిత్య పూజలకు ఉపయోగించే వెండి వస్తువులు, కుందులు, షఠారీ, ప్లేట్ తదితర సామగ్రి మూటకట్టుకుని బయటకు వస్తుండగా, గంగమ్మ జాతరకు వెళ్తున్న భక్తుల్లో నేలకొండపల్లికి చెందిన భూతం ఉమామహేశ్వరరావు, తోట ఉపేందర్ గమనించారు. మూటల్లో ఏమిటని పరిశీలించగా ఆలయ సామగ్రి కనిపించాయి. ఆపై నిందితులు పారిపోయేందుకు యత్నించగా ఒక బాలుడిని మాత్రం పట్టుకోగలిగారు. ఆపై ఎస్సై తోట నాగరాజు చేరుకుని బాలుడిని అదుపులోకి తీసుకుని మిగతా వారి కోసం గాలింపు మొదలుపెట్టారు. ఘటనపై దేవాదాయ శాఖ ఈఓ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఆలయానికి సంబంధించి బంగారు, వెండి ఆభరణాలు బ్యాంక్ లాకర్‌లో ఉండడం, ఇతర సామగ్రిని చోరీ చేసే క్రమంలో స్థానికులు అప్రమత్తం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

వైరా: భద్రాచలం డిపోకు చెందిన మహిళా కండక్టర్ పి.విజయలక్ష్మిపై ప్రయాణికురాలు దాడి చేయగా.. వైరా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన సీహెచ్.అరుణ దంపతులు ఆదివారం చుంచుపల్లిలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తమ కుమారుడి వద్దకు వెళ్లి వస్తున్నారు. ఆపై వైరా మండలం స్టేజీ పినపాకలోని డాన్‌బాస్కో స్కూల్‌లో చదువుతున్న ఇంకో కుమారుడి వద్దకు వెళ్లడానికి సుజాతనగర్‌లో భద్రాచలం డిపో బస్సు ఎక్కారు. అయితే, డాన్‌బాస్కో స్కూల్ వద్ద అరుణ భర్త దిగగా, ఇద్దరి టికెట్ ఆయన వద్దే ఉండిపోయింది. కాసేపయ్యాక టికెట్ విషయమై అరుణను కండక్టర్ విజయలక్ష్మి ఆమెను ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో కండక్టర్‌ను అరుణ దుర్భాషలాడుతూ దాడి చేసింది. ఘటనపై కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వైరా ఏఎస్సై డి.వెంకటనారాయణ తెలిపారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

మధిర: ప్రస్తుల సమాజ అభివృద్ధిలో యువత పాత్రే కీలకమని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. మధిరలో జరుగుతున్న పీవైఎల్ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం ఆయన మాట్లాడారు. మరణించి వందేళ్లు కావొస్తున్నా భగత్ సింగ్, చేగువేరా జీవితాలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని చెప్పారు. కాగా, నేటి యువతలో సామాజిక స్పృహను దూరం చేసేలా ఉన్న మత్తు, మాదకద్రవ్యాలను తరిమికొట్టేలా అందరూ పాటుపడాలని సూచించారు. అనంతరం జర్నలిస్ట్ రాయల నాగవర్ధన్, తదితరులు మాట్లాడగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కేఎస్.ప్రదీప్, వి.అజయ్, నాయకులు ప్రతాప్, రవికుమార్, ఎస్.వీ.రాకేష్, ఈశ్వర్, బుచ్చిరాజు, భరత్, ప్రేమ్‌సింగ్, మందా సురేష్, రామకృష్ణ, సుందర్, రంగయ్య, మోహన్, గణేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

పోలీసుల అదుపులో డీజిల్ దొంగలు?

1,100 లీటర్ల డీజిల్ స్వాధీనం

నేలకొండపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆగి ఉన్న లారీలు, ఇతరత్రా వాహనాల నుంచి డీజిల్ చోరీ చేస్తున్నారని ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యాన శనివారం అర్ధరాత్రి నేలకొండపల్లి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా డీజిల్ తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని గుర్తించారు. క్షుణ్ణంగా పరిశీలించగా డ్రమ్ముల్లో 1,100 లీటర్ల డీజిల్ లభించడంతో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలో చోరీ చేసి విక్రయానికి తీసుకెళ్తున్నట్లు తేలింది. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన ఓ వ్యాపారి ముఠాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారని సమాచారం. ఈవిషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఎస్సై తోట నాగరాజు ను వివరణ కోరగా... డీజిల్‌ను స్వాధీనం చేసుకోగా, కేసు విచారణ కొనసాగుతోందని తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బియ్యం పట్టివేత

తిరుమలాయపాలెం: మండంలోని పిండిప్రోలులో ముళ్ల పొదల్లో అక్రమంగా నిల్వ చేసిన 22 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం సీజ్ చేశారు. కొద్దిరోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు పిండిప్రోలులో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి పట్టా కప్పారు. అయితే, వర్షాల కారణంగా బియ్యం తడిసి వాసన వస్తుండడంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ చేరుకుని పరిశీలించారు. అప్పటికే బియ్యం పాడైపోవడంతో ఎవరూ ఉపయోగించకుండా డీలర్ సుందర్‌రావు, ఆర్‌ఐ వీరయ్య, కానిస్టేబుల్ హరికృష్ణ సమక్షాన పూడ్చివేయించారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

పెనుబల్లి: మండాలపాడు శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ఖమ్మంక్రైం : నగరంలోని పాత బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మహిళ స్పృహ తప్పి పడిపోగా, స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని, ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని వన్‌టౌన్ పోలీసులు సూచించారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి..



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

మధిర: బూర్జువా, కమ్యూనిస్టు రాజకీయాల మధ్య తేడాను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు సూచించారు. మధిర మండలం దెందుకూరులో ఆదివారం సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మొదలుకాగా పార్టీ నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోతినేని మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిణామాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాక పాలకుల తీరును ప్రజలకు వివరించి భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం చేసేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన లోకసభ, శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రధానమైన శక్తిగా ఎదగడం ప్రమాదకరమన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, యనమదల విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, మన్నేపల్లి సుబ్బారావు, బండారు రమేష్, శీలం నర్సింహారావు, మందా సైదులు, అనుమోలు భాస్కరరావు, పాపినేని రామనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఆర్ఐ మృతి



కందుకూరి రాము (ఫైల్)

మధిర/ఖమ్మంమయూరిసెంటర్: మధిర మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కందుకూరి రాము(49) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయన శనివారం రాత్రి కరీంనగర్ వెళ్లి వస్తుండగా నొప్పిగా అనిపించినా కుటుంబ సభ్యులకు చెప్పలేదని సమాచారం. ఆపై ఆదివారం ఉదయం గుండెలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో రాము మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ఏడేళ్లుగా మధిర మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా, ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఖమ్మంలోని ఆయన నివాసగృహంలో రాము మృతదేహం వద్ద టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ నాయకులు శ్రీను, జైపాల్, జి.శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లు పగడాల నాగరాజు, బుర్రి వెంకట్ కుమార్, చిన్న నాగరాజు, మహేందర్ చౌదరి, సందీప్ తదితరులు నివాళలర్పించారు. అలాగే, రాము మృతిపై మధిర మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు మొండితోక లత, శీలం విద్యాలత సంతాపం తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీలో మరో రెండు రోజులు వర్షాలు

ఉపరితల ఆవర్తనం ఫలితం



సాక్షి, అమరావతి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే రెండురోజులు ఏపీ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతుండగా, శనివారం పశ్చిమ బంగాళాఖాతం, కోస్తాంధ్ర తీరంలో ఏర్పడి సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దాంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో వచ్చే రెండురోజులు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తా యని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అనేకచోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని, అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, పలుప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఆదివారం ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా కొయ్యూరులో 24 గంటల్లో 9.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తూర్పుగోదా వరి జిల్లా తాళ్లపూడిలో 6 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో 7, కదిరిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీవారి ఆలయంలో రేపు ఆణివార ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకిపై తిరుమల వీధుల్లో ఊరేగుతారు. ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,916 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.87 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

రూ.3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

ఏపీలో 1.60 కోట్ల కుటుంబాల ఎదురుచూపులు

జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులు గంపెడాశలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు, ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోంది. జాబ్ కేలండర్‌పై గంపెడాశలు పెట్టుకుంది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి'ఇవ్వాలని కోరుతోంది. అధికారంలోకి వచ్చి నెల దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌లోని 1.60 కోట్ల కుటుంబాల్లోని యువత డిమాండ్ చేస్తోంది. 2014లో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారు. మరోసారి అలాంటి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. మళ్లీ బూటకపు హామీలతోనే ఇప్పుడు నాలుగోసారి అధికారంలోకి వచ్చారు. కానీ, ఆయన రాజకీయ జీవితంలో చెప్పింది చెప్పినట్లు ఏనాడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన దాఖలాలు లేవు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, హామీలను అమలు చేయడం ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ సంఖ్యలో యువత ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తోంది. చాలా మంది ప్రస్తుతం చేస్తున్న చిన్నా చితకా పనులు వదిలేసి.. స్టడీ సర్కిళ్లు, లైబ్రరీల బాట పడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతితో ఎలాగోలా నెట్టుకు రావచ్చనే ఉద్దేశంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

సూపర్ సిక్స్ టాప్‌లో భృతి

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్టు ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తట్లేదు. మెగా డీఎస్సీ పేరుతో నామమాత్రంగా ప్రకటించిన 16 వేల పోస్టుల భర్తీ కాస్తా నత్త నడకను తలపిస్తోంది. డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదవ తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడే వారు లక్షల్లో ఉన్నారు. వీరితో పాటు ప్రభుత్వ కొలువు సాధించేందుకు ఇంకా వయస్సు ఉండి.. ఆర్థిక తోడ్పాటు లేక పోటీ పరీక్షలను పక్కన పెట్టి ఊళ్లలో వ్యవసాయం, పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్న వారందరినీ కలుపుకుంటే దాదాపు ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగి కనిపిస్తున్న పరిస్థితి. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారందరూ కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చేసినట్టే చేస్తారా?

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014–19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి.. ఐదేళ్ల పబ్బం గడుపుకుని మొండి చెయ్యి చూపించారు. అప్పట్లో కూడా ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. నిరుద్యోగ భృతికి 2017–18లో రూ.500 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ, రూపాయి కూడా ఇవ్వలేకపోయారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు యువ నేస్తం పేరుతో తూతూ మంత్రంగా డ్రామా నడిపించారు. విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించారు. తొలుత 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చగా.. ఆ తర్వాత పది లక్షలకు కుదించారు. మళ్లీ అందులో 2.10 లక్షల మందే అర్హులంటూ.. 1.62 లక్షల మందికే ఇస్తామని.. దీనికి ఈ–కేవైసీ లింక్ పెట్టి కేవలం వేల సంఖ్యలో మాత్రమే నిరుద్యోగ భృతి ఇచ్చి మమ అనిపించారు. గతంలో ఇలా నిరుద్యోగ భృతి హామీని నీరుగార్చి.. ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ సారైనా నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలతో పాటు ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




ఉద్యోగాల కల్పన

చంద్రబాబు పాలనలో..	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో..	
2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు 34,108	2019-24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో శాశ్వత ఉద్యోగాలు 2,21,003	ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు 3,73,695
మే 2019 నాటికి మొత్తం ఉద్యోగులు 3,97,128	కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు 43,923	వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన మొత్తం ఉద్యోగాలు 6,38,621

'గంటా' ఆస్తుల వేలం!

రుణాలు ఎగ్గొట్టిన కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు బ్యాంకు ఝలక్

- మొత్తం రూ.390 కోట్ల రికవరీకి చర్యలు
- ఇప్పటికే పలుమార్లు నోటీసులిచ్చిన ఇండియన్ బ్యాంకు
- అయినా స్పందించని గంటా, ఆయన బంధువులు
- ఆగస్టు 8న ఆస్తులు వేలం వేస్తామని బ్యాంకు ప్రకటన జారీ



సాక్షి, విశాఖపట్నం: మాజీమంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయన బంధువులు రూ.వందల కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టిన కేసులో వారికి అప్పులిచ్చిన ఇండియన్ బ్యాంకు ఆస్తుల వేలానికి ఉపక్రమించింది. రుణాలను వడ్డీతో సహా వసూలు చేసుకునేందుకు వరుసగా డిమాండ్ నోటీసులు జారీచేసినా గంటా బ్యాచ్ పట్టించుకోకపోవడంతో తనఖా పెట్టిన వాటిలో పలు ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బ్యాంకు వాటి వేలానికి రంగం సిద్ధంచేసి అందుకు సంబంధించిన తేదీని తాజాగా ప్రకటించింది. గంటా రుణాల ఎగవేత కేసులకు సంబంధించిన వివరాలు ఏమిటంటే..

విశాఖపట్నం వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాన్యుఫ్యాక్చరింగ్, మిషనరీ అండ్ ఎక్విప్‌మెంట్ కార్యకలాపాల కోసం రిజిస్ట్రేషన్ నం.047165తో 2005 ఆగస్టు 18న రిజిస్టర్ అయ్యింది. రూ.500 కోట్ల ఆథరైజ్డ్ క్యాపిటల్, రూ.240.671 కోట్ల పెయిడ్ అప్ కాపిటల్‌తో ఈ సంస్థ ఏర్పడింది. కంపెనీలో యాక్టివ్ డైరెక్టర్లుగా గంటా తోడల్లుడైన పరుచూరి వెంకట భాస్కరరావు, ఆయన సోదరులు రాజారావు, వెంకయ్య, ప్రభాకరరావు ఉన్నారు. ఈ కంపెనీకి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు కొండయ్య, బాలసుబ్రహ్మణ్యం, నార్నే అమూల్యలు హామీదారులుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరుతో డాబా గార్డెన్స్ శారదా వీధిలో ఉన్న ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు పొందారు. ఇవి పొందినప్పటి నుంచి ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఒక దఫా తీసుకున్న రుణం తాలుకా బకాయిలు అక్షరాలా రూ.390.58 కోట్లుగా బ్యాంకు అధికారులు లెక్కగట్టారు. మరో దఫా రుణానికి సంబంధించి వడ్డీతో కలిసి రూ.141.68 కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని ఇండియన్ బ్యాంకు జారీచేసిన నోటీసుల్లో పేర్కొంది.

నోటీసులిచ్చినా బేఖాతరు.. ఆస్తుల స్వాధీనం..

ఈ నేపథ్యంలో.. 2016 అక్టోబరు 4 నుంచి పలు దఫాలుగా బ్యాంకు అధికారులు నోటీసులు జారీచేసి వడ్డీతో సహా కలిపి బకాయిలు చెల్లించాలని కోరారు. అయినాసరే ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం.. మరోపక్క గడువు ముగియడంతో బ్యాంకు ఆస్తులు స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టింది. అయినప్పటికీ గంటా ముందుకు రాకపోవడం.. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి ఏడు స్లాట్స్‌లో పూచీకత్తుగా పెట్టిన మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఈ ఏడాది మార్చి 18న బ్యాంకు నోటీసులు జారీచేసింది. ప్రత్యూష కంపెనీకి చెందిన ఆస్తులు, కంపెనీ డైరెక్టర్లయిన పరుచూరి వెంకట భాస్కరరావు, రాజారావు, వెంకయ్య ప్రభాకరరావుల ఆస్తులతో పాటుగా కంపెనీకి హామీదారులుగా ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు, కేబీ సుబ్రహ్మణ్యం, అమూల్య ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవడంతో పాటు మరికొన్ని ఆస్తుల వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటన జారీచేసింది. కాగా, గతంలోనే బ్యాంకు కొన్ని ఆస్తులను వేలం వేయగా.. ఇప్పుడు రూ.390 కోట్ల రికవరీకి బ్యాంకు మరిన్ని ఆస్తుల వేలం ప్రకటన జారీచేసింది.

ఆగస్టు 8న ఈ–వేలం..

ఈ ప్రకటనలో.. పద్మనాభం మండలం ఐనద గ్రామం వద్ద ఉన్న సర్వేనెం.12లో వీరికి స్టార్ విలేజ్ పేరున వుడా లేఅవుట్‌లోని 5,326.54 చ.గజాల విస్తీర్ణంలో ఏడు స్లాట్స్‌లో ఉన్న 33 ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసుల్లో స్పష్టం చేసింది. వీటి విషయంలో ఎలాంటి లావాదేవీలు జరపడానికి వీల్లేదని, బ్యాంకు హెచ్చరిక జారీచేసింది. అదేవిధంగా రూ.390.58 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు గతంలో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల విక్రయానికి కూడా మార్చి 18న బ్యాంకు మరోసారి నోటీసులు జారీచేసింది. దీనికి సంబంధించిన వేలం ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో శనివారం ఇండియన్ బ్యాంకు ప్రకటనలిచ్చింది. మెస్సర్స్ ప్రత్యూష అసోసియేట్స్ పేరుతో నగరంలోని గంగులవారి వీధిలో ఉన్న 274.65 చ.గజాల వాణిజ్య భవనం వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి రిజర్వ్ ధరగా రూ.2.56 కోట్లుగా నిర్ణయించింది. దీంతో పాటు ద్వారకానగర్‌లోని అదే సంస్థ పేరుతో శ్రీశాంత కాంప్లెక్స్‌లో ఉన్న ప్లాట్ నం.138సీ లోని 2,500 చ.గజాల విస్తీర్ణంగల రెండు ప్లాట్లను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి రిజర్వ్ ధరగా 1.26 కోట్లుగా నిర్ణయించారు. ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా.. ప్రాతిపదికన వేలంలో విక్రయిస్తామని బ్యాంకు వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన గంటా అండ్ కో ఆస్తుల ఈ–వేలం పాట జరుగుతుందని ఇండియన్ బ్యాంకు పేర్కొంది.

జిల్లా వార్తలు

డిప్యూటీ సీఎంను కలిసిన రాయల



డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాయల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సన్మానించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆత్మీయ అభినందన సభ

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు ఆత్మీయ అభినందన సభ మంగళవారం నిర్వహించనున్నారు. ఖమ్మం మామిళ్లగూడెంలో ఉన్న వీవీసీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి హాజరవుతారని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ తెలిపారు.

'రైతుభరోసా' తక్షణమే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తీగల సాగర్

చింతకాని: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యాన ప్రభుత్వం రైతుభరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. చింతకాని మండలం కొదుమూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పెట్టుబడికి అవసరమైన సమయంలో నిధులు జమ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. అలాగే, గతంలో రుణమాఫీకి నోచుకోని రైతులకు సైతం వర్తింప చేయాలని, పంటల మద్దతు ధరపై చట్టం చేయాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పోతినేని సుదర్శన్, మాదినేని రమేష్, నాయకులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, శీలం ఫకీరమ్మ, బిక్కసాని గంగాధర్, రావుల రాజబాబు, కోట్లేటి ఉపేందర్, మల్లెంపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సరే.. బకాయిలు ఎలా?!

సర్పంచ్‌లు లేక, నిధులు రాక కార్యదర్శులపైనే భారం

- అభివృద్ధి పనులకు అప్పులు తెచ్చి పెట్టిన పలువురు
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బిల్లులు
- బదిలీకి ముందే చెల్లించాలని డిమాండ్



పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: 'నాకు గ్రామపంచాయతీ నుంచి రూ.2.50 లక్షల బిల్లులు రావాలి. అభివృద్ధి పనులతో పనులతో పాటు ఇతరత్రా పనులకు పెట్టుబడి పెట్టిండని అధికారులు చెప్పారు. ఇప్పుడు బదిలీల ప్రక్రియ మొదలైంది. నేను ఇక్కడి నుంచి వెళ్లిపోతే బకాయిలు రాబట్టుకోవడం ఎలా? సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలకే దిక్కులేదు. మా సంగతి ఏమిటి? బదిలీకి ముందే నాకు డబ్బు చెల్లించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటా' అంటూ ఇల్లెందు మండలంలోని ఓ కార్యదర్శి వాట్సప్ గ్రూప్‌లో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. పాలకవర్గాల పదవీకాలం ముగిశాక అభివృద్ధి పనులు, కార్యాల నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఖాతాల్లో నగదు లేక అధికారుల సూచనలతో పలువురు కార్యదర్శులు అప్పు చేసి మరీ పెట్టుబడి పెట్టారు. ఇంతలోనే బదిలీల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రస్తుత స్థానం నుంచి వెళ్లిపోతే బకాయిల మాట ఏమిటనే ప్రశ్న వారిని వేధిస్తోంది.

రూ.లక్షల్లో బకాయిలు

గత ప్రభుత్వం తెలంగాణ అవతరణ ఉత్సవాల వేళ పలు పేర్లతో చేపట్టిన కార్యక్రమాలకు కొన్ని చోట్ల సర్పంచ్‌లు, మరికొన్ని చోట్ల కార్యదర్శులు పెట్టుబడి పెట్టారు. చెరువుల పండుగ పేరుతో నిర్వహించిన కార్యక్రమాలు వందలాది మందికి భోజనం పెట్టిన సమయాన ఖర్చయింది. ఇక గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిశాక ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. కానీ వీరికి నిధులు, విధులపై స్పష్టత లేకపోవడంతో భారం కార్యదర్శులపై పడింది. దీంతో ఏ పని చేయాలన్నా కార్యదర్శులు జేబులు తడుముకోవాల్సి వస్తోంది. అంతేకాక గ్రామపంచాయతీ ఖాతాల్లో నిధులు లేక ఒక్కో కార్యదర్శి రూ.50వేలకు పైగానే పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. కొందరైతే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.

ఖాళీ ఖజానా

గ్రామపంచాయతీల్లో ఉద్యోగుల వేతనాల చెల్లింపు, అభివృద్ధి పనుల కోసం ఇంటి పన్నులతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం ఇచ్చే నిధులపై ఆధారపడతారు. అయితే, 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ప్రత్యేక పాలన ప్రారంభమైనప్పటి నుంచి అవీ రావడం లేదు. దీంతో పంచాయతీల ఖజానా ఖాళీ అయ్యాయి. ఫలితంగా కార్మికుల వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండగా.. ఇతర పనుల కోసం కార్యదర్శులు అప్పులు చేసి నెట్టుకొస్తున్నట్లు సమాచారం.

సర్పంచ్‌ల బకాయిలు సాగదీత

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఆరు నెలలు గడుస్తుండగా.. వారు బాధ్యతలు నిర్వర్తించిన సమయాన ఎస్ఎఫ్‌సీ నిధుల మంజూరు లేకపోవడం, 15వ ఆర్థిక సంఘం నిధులు మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐ, విద్యుత్తు చార్జీలకే సరిపోవడంతో సొంతంగా పెట్టుబడి పెట్టారు. అంతేకాక మరికొందరు గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బకాయిలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా అడుగు ముందుకు పడలేదు.

బదిలీల సమయం కావడంతో..

ప్రస్తుతం అన్ని శాఖల్లో ప్రభుత్వం బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇందులో భాగంగానే గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలకు సైతం రంగం సిద్ధమైంది. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతీ మండలం నుంచి 40శాతం కార్యదర్శులను చేయాల్సి ఉంటుంది. అయితే, పదవీకాలం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా సర్పంచ్‌లకే బకాయిలు విడుదల కాకపోగా, తాము పెట్టిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు, తాము బదిలీపై వెళ్లిపోతే పరిస్థితి ఏమిటనే ఆందోళన కార్యదర్శుల్లో వ్యక్తమవుతోంది. ఇల్లెందు మండలంలోని ఒక జీపీ కార్యదర్శి తన బకాయి వెంటనే చెల్లించని పక్షంలో కలెక్టరేట్ ముందు ఆత్మహత్య చేసుకుంటానని కార్యదర్శుల వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇదే ఆవేదన జిల్లాలోని కార్యదర్శులందరిలోనూ ఉన్నట్లు తెలుస్తోంది.

ఆందోళన అవసరం లేదు...

గ్రామపంచాయతీల నిర్వహణ కోసం పెట్టిన పెట్టుబడిపై కార్యదర్శులకు భయం అవసరం లేదు. బదిలీ సమయంలో కొత్త కార్యదర్శులకు చార్జీ అప్పగించే సమయాన బకాయి బిల్లులకు సంబంధించి రశీదులన్నీ సమర్పించాలి. తద్వారా నిధులు మంజూరైన వెంటనే చెల్లింపులు జరుగుతాయి.

– చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

గందరగోళంగా కార్యదర్శుల బదిలీ ప్రక్రియ

ఇల్లెందురూరల్: జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 332 మంది గ్రేడ్–4 కార్యదర్శులు ఉండగా, తొలుత మండలం యూనిట్‌గా తీసుకుని 89 మందితో, ఆ తర్వాత స్టేషన్ సీనియారిటీ తీసుకుని 79 మందితో బదిలీ జాబితా సిద్ధం చేశారు. చివరకు 40 శాతం మందిని బదిలీ చేయాలని నిర్ణయించడంతో జాబితాలో 133 మందికి స్థానం దక్కింది. కాగా బదిలీ జాబితాలో తప్పిదాలు జరిగాయని పలువురు కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. సుమారు 20 మంది కార్యదర్శులు విధుల్లో చేరిన తేదీని తప్పుగా నమోదు చేయించుకున్నారని, దీంతో సీనియారిటీ జాబితాలో వారి పేర్లు కొంత ముందుకు వచ్చాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కౌన్సెలింగ్‌కు పిలుపు అందక..

జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్–1, 2, 3 కార్యదర్శుల్లో ఏడుగురు స్పౌస్, సీనియారిటీ కోటాలో భద్రాద్రి జిల్లా నుంచి ఖమ్మం జిల్లాకు ఆప్షన్ పెట్టుకున్నారు. కాగా సోమవారం నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యదర్శులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లా మార్పుతో ఆప్షన్ ఎంచుకున్న వారి జాబితాపై ఆయా జిల్లాలకు కమిషనరేట్ నుంచి సమాచారం వెళ్లాలి. కానీ ఆదివారం సాయంత్రం వరకు ఈ ప్రక్రియ పూర్తికాకపోవంతో కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. కాగా బదిలీ ప్రక్రియలో గ్రేడ్–4 కార్యదర్శులకు అన్యాయం జరగకుండా చూడాలని సోమవారం జిల్లా అధికారులను కలిసి విన్నవించనున్నట్లు కార్యదర్శుల సంఘం నేతలు తెలిపారు.

నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ముప్పు

సెమినార్‌లో న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి





సెమినార్‌లో మాట్లాడుతున్న న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని, ప్రశ్నించే తత్వాన్ని చంపేసేలా చట్టాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సరికాదని పేర్కొన్నారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో 'నూతన చట్టాలు–సమాజంపై ప్రభావం' అంశంపై నిర్వహించిన సెమినార్‌కు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షత వహించగా విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం ఏ వర్గంతోనూ కూలంకుశంగా చర్చించకుండా చట్టాల అమలుకు పూనుకుందని తెలిపారు. కొత్త చట్టాల్లో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని చెప్పారు. మహిళలపై దాడులకు సంబంధించి పోలీసులు అప్పటికప్పుడు ఎఫ్ఐఆర్ చేయకుండా 14 రోజుల పాటు కాలయాపన చేసే అవకాశముండడంతో కొనిసార్లు కేసులు తారుమారయ్యే ప్రమాదముందని తెలిపారు. ఈ సెమినార్‌లో సీపీఐ నాయకులు, న్యాయవాదులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, జానిమియా, కొండపర్తి గోవిందరావు, కనకం జనార్దన్, పట్టాభి, ఎస్.కే.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, శింగు నర్సింహారావు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బూడిద బంగారమాయే..

- మండిపోతున్న బీటీపీఎస్ బూడిద ధర
- ఏడాదికే రెట్టింపు చేసిన వైనం
- ఆపై లోడింగ్‌కు అదనంగా వసూళ్లు





ప్లాంట్ వద్ద బారులు దీరిన లారీలు (ఇన్‌సెట్) లారీలో బూడిద లోడ్ చేస్తున్న దృశ్యం

పినపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు–పినపాక సరిహద్దుల్లో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్(బీటీపీఎస్)లో బూడిద బంగారంలా మారింది. ఇక్కడ వెలువడే బూడిదను సిమెంట్ ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీల యజమానులు కొనుగోలు చేస్తారు. అయితే, మిగతా ప్లాంట్లతో పోలిస్తే ఇక్కడ ధర ఎక్కువగా ఉండడం.. ఏటా పెంచుతుండడం విమర్శలకు తావిస్తోంది. పాల్వంచ కేటీపీఎస్‌లో టన్ను బూడిద రూ.30 నుండి రూ.50 వరకు పలుకుతున్న ధర బీటీపీఎస్‌కు వచ్చేసరికి రూ.130 నుండి రూ.150 వరకు అమ్ముతుండడం గమనార్హం.

ఏడాదిలోనే రెట్టింపు

పవర్ ప్లాంట్‌లో ఏటా బూడిద ధర పెంచుతుండడం గమనార్హం. మొదటిలో టన్ను ధర రూ.60 నుండి రూ.70 వరకు ఉండేది. ఏడాది దాటేలోగా రూ.130 నుండి రూ.150 వసూలు చేస్తున్నారు. ఇక లోడింగ్ చార్జీలు, లారీ అద్దె కలిపితే వినియోగదారులకు చేరే సరికి ధర మరింత పెరుగుతోంది.

టెండర్ల పేరుతో దోపిడీ?

థర్మల్ పవర్ ప్లాంట్లలో వెలువడే బూడిదను కొన్నిచోట్ల స్థానికులకు ఉచితంగా, మరికొన్ని ప్లాంట్లలో టన్నుకు రూ.1 నుండి రూ.30 వరకు వసూలు చేస్తారు. కానీ బీటీపీఎస్‌లో మాత్రం తొలి ఏడాదే రూ.70 వరకు వసూలు చేశారు. ఆపై రూ.130 నుండి రూ.150కి ధర పెంచారు. అయితే, టెండర్ల పేరుతో అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై ధర పెంచి విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు లోడింగ్ చేసినందుకు రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

లోడింగ్ కావడం లేదు..

ప్లాంట్ నుండి సిమెంట్ కంపెనీలు, బట్టీలకు బూడిద తీసుకువెళ్తాను. అయితే, లోడింగ్ కోసం ప్లాంట్ వద్ద ఒక్కోసారి రెండు రోజులు వేచి ఉండాల్సి వస్తోంది. ఇదేమిటని అడిగితే మెయింటనెన్స్ చేస్తున్నాం, షిఫ్ట్ మారుతోంది, యూనిట్ ఆగిపోయిందని చెబుతున్నారు. ఇకనైనా లారీలకు తొందరగా లోడింగ్ చేస్తే మాకు మేలు జరుగుతుంది.

– రాజు, లారీ డ్రైవర్

స్థానికులకు ధర తగ్గించాలి

ప్లాంట్‌పై ఆధారపడి ఇటుక బట్టీ ఏర్పాటుచేసుకుని బూడిద కొనుగోలు చేస్తున్నాం. అయితే, స్థానిక బట్టీలకు సైతం బయటి వారి మాదిరిగానే ఎక్కువ ధర తీసుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేసి స్థానికంగా ఉన్న ఇటుకల బట్టీకి బూడికదను తక్కువ ధరకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. –సుబ్బారెడ్డి, ఇటుకల బట్టీ యజమాని